
రోడ్డెక్కిన రైతులు

- యూరియా కోసం తప్పని తిప్పలు
- టోకెన్ల కోసం పడిగాపులు
- సరిపడా నిల్వలు లేక నిరాశ
- ఆగ్రహంతో ఆందోళనబాట

7

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంగళవారం 2 సెప్టెంబరు 2025

రాంమందిర్ గణపయ్య సన్నిధిలో సంగీత విభావరి

కాంగో డ్రమ్స్ వాయిస్తూ భక్తిగీతాలు ఆలపించిన జగ్గారెడ్డి



కాంగో డ్రమ్స్ వాయిస్తూ భక్తిగీతాలు ఆలపిస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని రాంమందిర్ వద్ద టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపయ్య సన్నిధిలో ఆదివారం రాత్రి సంగీత విభావరి నిర్వహించారు. సినీ నేపథ్య గాయకులు పాల్గొని తమ గాత్రంతో ఆకట్టుకున్నారు. కార్యక్రమాన్ని తిలకించడానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. జగ్గారెడ్డి స్వయంగా కాంగో డ్రమ్స్ వాయిస్తూ భక్తి గీతాలు ఆలపించారు.



సంగీత విభావరికి హాజరైన గాయకులతో జగ్గారెడ్డి

పంచాయతీ కార్యదర్శిపై విచారణ

- ఈ క్రమంలోనే గృహలక్ష్మి బిల్లులు రావడం లేదని పెట్రోల్ పోసుకుని వ్యక్తి హల్‌చల్

నంగునూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నంగునూరు మండలం పాలమాకుల గ్రామ పంచాయతీ కార్యదర్శి అనితపై విచారణ సందర్భంగా నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. గ్రామ సభలు నిర్వహించకుండానే తీర్మానాలు చేస్తున్నారని గ్రామస్థులు ఇటీవల ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ అధికారిగా నారాయణరావుపేట ఎంపీవో శ్రీనివాసరావును నియమించారు. సోమవారం విచారణ చేపడుతుండగా గ్రామస్థుల్లో ఒకరైన యాదండ్ల నారాయణ గత ప్రభుత్వ హయాంలో మంజూరైన గృహలక్ష్మి పథకం బిల్లు రావడం లేదని, ఈ విషయంలో నిర్లక్ష్యం జరుగుతోందని ఆరోపిస్తూ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అప్రమత్తమైన గ్రామస్థులు వెంటనే అతడిని అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. మరో వ్యక్తి నూనె కుమారస్వామి సైతం తమకు 'ఇందిరమ్మ' ఇళ్లు మంజూరైనా ప్రొసీడింగ్ ఇవ్వడం లేదని అధికారుల దృష్టికి తెచ్చాడు. దీనిపై స్పందించిన విచారణ అధికారి శ్రీనివాసరావు, అర్హులందరికీ ఇళ్లు మంజూరవుతాయని, ఎవరూ అఘాయిత్యాలకు పాల్పడవద్దని సూచించారు. గ్రామస్థుల విజ్ఞప్తులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ విచారణలో నంగునూరు ఎంపీవో ప్రభాకర్ రావు కూడా పాల్గొన్నారు.



పాలమాకుల గ్రామపంచాయతీలో విచారణ చేపడుతున్న ఎంపీవో శ్రీనివాసరావు



తిమ్మాపూర్‌లో సందర్శిస్తున్న ఏడీ

వ్యక్తిగత పరిశుభ్రతతో

వ్యాధులు దూరం

- రాష్ట్ర వైద్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యశాఖ అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్‌నాయక్ సోమవారం తిమ్మాపూర్ గ్రామాన్ని సందర్శించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు, వైరల్ ఫీవర్లను అరికట్టవచ్చని ఆయన తెలిపారు. ఇంటింటికీ వెళ్లి నీటి కుళాయిలు, తొట్టిలను పరిశీలించి, నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఆర్ఎంపీ, పీఎంపీల వద్దకు వెళ్లి చికిత్సలు చేయించుకోవద్దని సూచించారు.

డెంగ్యూ మరణాలపై విచారణ చేపట్టాలి

తిమ్మాపూర్‌లో డెంగ్యూ వ్యాప్తి, చిన్నారుల మరణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ గ్రామస్థులు కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు వినతి పత్రం సమర్పించారు. పారిశుధ్య పనుల విషయంలో నిర్లక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శి శైలేష్‌పై చర్యలు తీసుకున్నారని, గ్రామ ప్రత్యేక అధికారి ఎంపీడీవో రాంరెడ్డిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. గ్రామ కార్యదర్శి దళితుడు కాబట్టే అతడిపై చర్యలు తీసుకున్నారని, అగ్రవర్ణాలకు చెందిన ఎంపీడీవో రాంరెడ్డిపై చర్యలు తీసుకోకుండా డీపీవో తప్పుడు నివేదిక ఇచ్చారని ఆరోపించారు.

ఓ వైపు విష జ్వరాలు, మరోవైపు ఆసుపత్రి బిల్లులు. ఈ రెండింటి మధ్య నలిగిపోతూ కన్నీటిపర్యంతమవుతున్నారు జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ గ్రామ ప్రజలు. పది రోజులుగా ప్రతీ ఇంట్లో ఒకరిద్దరు జ్వరాల బారిన పడగా, కొన్ని ఇళ్లలో కుటుంబ సభ్యులందరూ మంచం పట్టారు. దీనికి తోడు డెంగ్యూ లక్షణాలు కూడా వెలుగులోకి రావడం ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లిన వారు రూ.వేలు, రూ.లక్షల్లో బిల్లులు కట్టి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇప్పటికే ముగ్గురు మృతి చెందారు. అయితే డెంగ్యూ కేసులు రోజురోజుకూ పెరుగుతుండడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్య లోపమే ఈ విపత్తుకు ప్రధాన కారణమని వారు వాపోతున్నారు.



తిమ్మాపూర్ గ్రామంలో బురదమయంగా ఉన్న రోడ్లు

విషజ్వరాల విజృంభణ

తిమ్మాపూర్ వాసుల అవస్థలు

- మరో ఇద్దరికి డెంగ్యూ లక్షణాలు
- ఒకే కుటుంబంలో నలుగురికి విష జ్వరాలు
- ఆస్పత్రి బిల్లుల కోసం అప్పులు
- బురదమయంగా అంతర్గత రోడ్లు
- పారిశుధ్య లోపమే ప్రధాన సమస్య!
- ఆందోళనలో గ్రామస్థులు

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్‌లో ప్రజలు పది రోజులుగా విష జ్వరాలతో తీవ్రంగా బాధపడుతున్నారు. ప్రతి ఇంట్లోనూ ఒకరిద్దరు జ్వరంతో మంచం పడుతున్నారు. కొన్ని ఇళ్లలో అయితే కుటుంబసభ్యులు అందరూ జ్వరాల బారిన పడి ఆస్పత్రి పాలవుతున్నారు. ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తుండడంతో చేసేదేమీ లేక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఎవరిని పలకరించినా జ్వరాలతో బాధపడుతూ కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఇటీవల ఈ విష జ్వరాల కారణంగా యువకుడు, ఇద్దరు చిన్నారులు మరణించినప్పటికీ, గ్రామంలో ఎలాంటి మార్పురాలేదు.

పారిశుధ్య లోపమే కారణమా?

గ్రామంలో ఈ జ్వరాల విజృంభణకు ప్రధానంగా పారిశుధ్య లోపమే కారణమని గ్రామస్థులు భావిస్తున్నారు. గ్రామ పంచాయతీలో నిధులు లేకపోవడంతో పారిశుధ్య పనులు సరిగా జరగడం లేదని తెలుస్తోంది. సర్పంచుల పదవీకాలం ముగిసినప్పటి నుంచి ఈ సమస్య మరింత తీవ్రమైంది. పనులు చేద్దామన్నా నిధులు లేకపోవడంతో గ్రామ కార్యదర్శులు కూడా నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ముఖ్యంగా, గ్రామంలో మురుగు కాలువలు సరిగా లేకపోవడం, ఉన్నవి కూడా అస్తవ్యస్తంగా ఉండటంతో దోమల బెడద విపరీతంగా పెరిగింది. దీనికి తోడు వర్షాలు కురవడంతో వీధులన్నీ బురదమయంగా మారి, చెత్తాచెదారం పేరుకుపోయింది. ఇదే డెంగ్యూ లాంటి వ్యాధులు ప్రబలడానికి కారణమని వాపోతున్నారు.

నిధులు లేకుండా ఆదేశాలా..?

ఇటీవల కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. అయితే, నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు ఎలా చేస్తారని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. గ్రామ కార్యదర్శి శైలేష్ సొంత ఖర్చులతో సుమారు రూ.50వేలకు పైగా వెచ్చించి పారిశుధ్య పనులు చేసినప్పటికీ గ్రామం మొత్తానికి సరిపోలేదు.

మిగతా 8వ పేజీలో



జ్వరంతో బాధపడుతున్న చిన్నారి మోక్షిత

చిరుతపులి జాడ కోసం అన్వేషణ



వ్యవసాయబావి సమీపంలో కెమెరాలను బిగిస్తున్న సిబ్బంది

చేర్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం చుంచనకోట శివారులోని గుట్టల్లో పులి సంచారంపై ఫారెస్ట్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామానికి చెందిన యాట ఆగయ్య అనే రైతు వ్యవసాయ బావి వద్ద లేగదూడను హతమార్చి గుట్టలోకి ఈడ్చుకెళ్లిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ నేపథ్యంలో సోమవారం ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ లింగమూర్తి, బీట్ ఆఫీసర్ రాముడితో పాటు స్థానిక రైతులు కలిసి గుట్టల చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించారు. అక్కడ గుర్తించిన పాదముద్రలు పులివా, లేక పెద్ద నక్కవా అనే సందేహాలు తలెత్తాయి. వాటి కదలికలపై నిఘా ఉంచడానికి ఆగయ్య వ్యవసాయ బావి వద్ద కెమెరాను ఏర్పాటు చేశారు. రైతులు ఒంటరిగా వెళ్లొద్దని, పశువులను ఇంటివద్దే కట్టేయాలని అధికారులు సూచించారు. రెండు రోజులు గడిచినా పులి జాడ కానరాకపోవడంతో సమీప గ్రామాల రైతులు భయాందోళన చెందుతున్నారు.

గజ్వేల్ బాలుర ఎడ్యుకేషన్‌హబ్‌లో

క్షుద్రపూజల కలకలం

గజ్వేల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని జూనియర్ కళాశాల వద్ద క్షుద్రపూజల కలకలం సృష్టించింది. సోమవారం ఉదయం కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌గౌడ్ పాటు ఇతర అధ్యాపకులు కళాశాలకు వచ్చినప్పుడు ప్రధాన ద్వారం ఎదుట పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, కోడిగుడ్లు, గాజులు, ముగ్గు వేశారు. విద్యార్థులు ఇంకా పెద్దగా రాకపోవడంతో ప్రిన్సిపల్ సిబ్బందితో ఆ సామగ్రిని తీసేయించి, ఆ ప్రాంతాన్ని నీటితో శుభ్రం చేయించారు. కళాశాలకు సరిగా ప్రహరీ, సెక్యూరిటీ లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ప్రిన్సిపల్ తెలిపారు. వారం క్రితం పాలిటెక్నిక్ కళాశాల వద్ద కూడా ఇలాంటివే కనిపించడంతో అప్పుడు కూడా వాటిని తొలగించారు. పోలీసులు ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. ఆకతాయిలు ఈ పని చేశారా, లేక వేరే ఎవరైనా చేశారా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.



గజ్వేల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధాన ద్వారం వద్ద పసుపు, కుంకుమ

కొమురవెల్లి మల్లన్న

ఆలయ ఈవోగా వెంకటేష్

- రెండు రోజులకే మారిన నియామకం



వెంకటేష్

కొమురవెల్లి, సెప్టెంబరు 1: కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారి (ఈవో)గా టంకశాల వెంకటేష్‌ను నియమిస్తూ దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయం ప్రిన్సిపల్ సెక్రటరీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు రోజుల క్రితమే అంజనీదేవిని ఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించడానికి ఆలయానికి వచ్చారు. అయితే ఆమె బాధ్యతలు తీసుకోకుండానే స్వామివారిని దర్శించుకుని వెనుదిరిగి వెళ్లిపోయారు. తిరిగి నూతన ఈవోగా వెంకటేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు

- బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాధకులు, సాగునీటి ప్రదాతలు కేసీఆర్, హరీశ్‌రావుపై, అలాగే కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని బీఆర్ఎస్ సిద్దిపేట నాయకులు ఆరోపించారు. సోమవారం సిద్దిపేటలోని రంగధాంపల్లి చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు రాధాకృష్ణశర్మ, పాల సాయిరాం, కొండం సంపత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేస్తోందని, అసెంబ్లీలో హరీశ్‌రావు మాట్లాడుతుండగా మైక్ కట్ చేసినందుకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రంగనాయకసాగర్ ప్రాజెక్టు నుంచి గోదావరి నీరు తెచ్చి అమరవీరుల స్థూపం వద్ద జలాభిషేకం చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేసి నినాదాలు చేశారు. రాస్తారోకో కారణంగా మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రాజెక్టులోని 288 పిల్లర్లలో కేవలం మూడు పిల్లర్లు కుంగినంత మాత్రాన కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని, రిపేర్ చేస్తే అయ్యే ఖర్చు చాలా తక్కువేనని పేర్కొన్నారు. రిపేర్లు చేసి రైతులకు నీళ్లు ఇవ్వకుండా బురద రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. సిద్దిపేటతో పాటు మెదక్, సంగారెడ్డి, యాదాద్రి, కరీంనగర్, వరంగల్, సిరిసిల్ల జిల్లాలకు తాగునీరు, సాగునీరు అందిస్తున్న కాళేశ్వరాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు.

తప్పిన ప్రమాదం..

నిరసనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేస్తుండగా మంటలు చెలరేగి పక్కనే ఉన్న కొందరు విద్యార్థి విభాగం నాయకులకు అంటుకున్నాయి. వెంటనే నీళ్లు చల్లడంతో పెను ప్రమాదం తప్పింది. కార్యక్రమంలో జాప శ్రీకాంత్‌రెడ్డి, కుంబాల ఎల్లారెడ్డి, కోల రమేశ్‌గౌడ్, నాయకం లక్ష్మణ్, మోహిద్, రాగుల సారయ్య, పెర్క మధు, ఇరుగంటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మల్లన్నసాగర్ రిజర్వాయర్ వద్ద కాళేశ్వరం నీటితో కేసీఆర్ ఫ్లెక్సీకి జలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్



రంగధాంపల్లి చౌరస్తా వద్ద రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- తొగుట: కేసీఆర్‌పై కక్షతోనే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ ఎంక్వైరీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడం దుర్మార్గమని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తీవ్రంగా మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్, బీజేపీ ఏకమై తెలంగాణను ఎడారిగా మార్చాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. తొగుట మండలం తుక్కాపూర్ గ్రామ సమీపంలోని మల్లన్నసాగర్ రిజర్వాయర్ వద్ద సోమవారం బీఆర్ఎస్వీ శ్రేణులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఫ్లెక్సీలకు కాళేశ్వరం జలాలతో జలాభిషేకం చేశారు. మేడిగడ్డ వద్ద కుంగిన రెండు పిల్లర్లను రిపేరు చేసి రైతాంగానికి నీళ్లందించాలని ఎన్‌డీఎస్ఏ నివేదికలో స్పష్టంగా చెప్పినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇరవై నెలలు గడిచినా పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. గోదావరి జలాలను పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నా రేవంత్‌రెడ్డి సర్కార్ కుమ్మక్కై పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో యూరియా కోసం రైతులు తల్లడిల్లుతుంటే అసెంబ్లీలో చర్చించకుండా, కాళేశ్వరం కమిషన్ పుస్తకాన్ని పట్టుకుని కూర్చోవడం భావ్యమేనా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జి సురేశ్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, యూత్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.



మహిళల దీపారాధన

సిద్దిపేట పట్టణంలో వినాయక నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. పట్టణంలోని టెలికాంనగర్ కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద మహిళలు సోమవారం దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. కాలనీకి చెందిన మహిళలందరూ పాల్గొని వివిధ రూపాల్లో దీపాలను అలంకరించి స్వామివారిని వేడుకున్నారు.

\- సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి)



మృత్యువును జయించిన బాలిక

●కోమాలోకి వెళ్లిన శ్రీజ ●యాంటీ స్నేక్ వీనమ్ ఇంజక్షన్ ఇచ్చి కాపాడిన వైద్యులు

సిద్దిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విషపూరితమైన కట్లపాము కాటు వేయడంతో పది రోజుల పాటు అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఓ పదేళ్ల బాలికకు, సిద్దిపేట జీజీహెచ్ వైద్యులు మెరుగైన వైద్య సేవలనందించి చివరికి బాలిక ప్రాణాలను కాపాడారు. ఈ మేరకు పదేళ్ల బాలిక శ్రీజను సోమవారం డిశ్చార్జి చేశారు. చిన్నకోడూరు మండలం రామంచ గ్రామానికి చెందిన గంగరవేని శ్రీనివాస్, అంజలి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వీరిలో రెండవ కూతురు శ్రీజ (10) ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతుంది. జూలై 31న అర్ధరాత్రి శ్రీజ కుడి చేతిపై కట్లపాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు వెంటనే పాపను సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. హెచ్‌వోడీ డాక్టర్ సురేష్‌బాబు, అనస్థీషియా విభాగ వైద్యుడు డాక్టర్ చందర్ శ్రీజ శరీరంలోకి విష ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు పలు పరీక్షల ద్వారా గుర్తించారు. అప్పటికే పాప అపస్మారక స్థితిలోకి వెళ్లడం, నరాలు బలహీనత, గుండె, మెదడుపై తీవ్ర విష ప్రభావం వల్ల మాట్లాడలేకపోయినట్లు గుర్తించారు. సరైన కండీషన్‌లో లేని శ్రీజకు సీపీఆర్ చేసి 10 రోజుల పాటు వెంటిలేటర్‌పై ఉంచి, ప్రతిరోజు అబ్జర్వేషన్ చేస్తూ, మెరుగైన వైద్య సేవలలో భాగంగా సుమారు 60 డోసుల వరకు ఏఎస్‌వీ (యాంటీ స్నేక్ వీనమ్) ఇచ్చారు. పది రోజుల తర్వాత బాలిక కాస్త కోలుకోవడంతో వెంటిలేటర్ తొలగించి చికిత్స అందిస్తూ 30 రోజుల పాటు వైద్య చికిత్స అందించారు. బ్రెయిన్ సిటీ స్కాన్, ఎంఆర్ఐ, ఫిజియోథెరపీ వంటి వైద్యం అందించడం వల్ల ప్రస్తుతం బాలిక ఆరోగ్యంగా ఉందని, ఈమేరకు డిశ్చార్జి చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. దీంతో ఆ వైద్యబృందం చేసిన కృషికి అటు తల్లిదండ్రులే కాకుండా శ్రీజతో పాటు పలువురు వైద్య బృందానికి అభినందనలు తెలిపారు.


శ్రీజతో వైద్య బృందం, కుటుంబ సభ్యులు

డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డికి అరుదైన పురస్కారం


కలకుంట్ల రాజేశ్వర్ రెడ్డిని పురస్కారంతో సత్కరిస్తున్న శ్రీ శ్రీ కళావేదిక సభ్యులు

సిద్దిపేట క్రైం సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సిద్దిపేటకు చెందిన ప్రముఖ జ్యోతిషుడు, కవి డాక్టర్ కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డికి మరోసారి అరుదైన గౌరవం దక్కింది. ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా నరసరావుపేటలో అంతర్జాతీయ సాంస్కృతి సంస్థ శ్రీ శ్రీ కళావేదిక వారు తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా ఆదివారం రాత్రి సాహితీ సభ నిర్వహించారు. సాహితీ సభలో సిద్దిపేటకు చెందిన డాక్టర్ కలకుంట రాజేశ్వర్ రెడ్డి తెలుగు సాహిత్య రంగంలో చేసిన విశేష సేవలను గుర్తించి గజమాలతో సత్కరించారు. అనంతరం తెలుగు భాషా సేవ విశిష్ట తెలుగుతేజం పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ కళావేదిక మేనేజింగ్ డైరెక్టర్ డా.కత్తిమండ ప్రతాప్ , ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ అధ్యక్షులు కోటేశ్వర్ రావు , జాతీయ మహిళా అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణంలు పాల్గొన్నారు .ఈ సందర్భంగా సిద్దిపేటలో పలువురు డాక్టర్ రాజేశ్వర్ రెడ్డిని ప్రశంసించారు.

ఇద్దరి అదృశ్యం

పటాన్‌చెరు సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ యువతి, ఓ బాలిక అదృశ్యం అయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో నివాసం ఉంటున్న భాగ్యలక్ష్మి గత నెల 30వ తేదీన ఉదయం 9.30 గంటలకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో అన్న సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బాలిక అదృశ్యం

రామేశ్వరంబండ గ్రామంలో నివాసం 14ఏళ్ల శాంతి అనే బాలిక సోమవారం మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికారు. బంధువుల ఇళ్లల్లో విచారించారు. ప్రయోజనం లేకపోవడంతో తల్లి పెంటమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


శాంతి(ఫైల్)

పనులు చేస్తూ జారిపడ్డ తాపీ మేస్త్రి

నిజాంపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నాలుగో అంతస్తులో నిర్మాణ పనులు చేస్తూ ఓ తాపీ మేస్త్రి జారి కిందపడ్డాడు. దీనిలో అతని రెండు కాళ్లు విరిగాయి. ఘటన మండల పరిధి నందిగామలో సోమవారం చోటుచేసుకుంది. అతడు గత ఏడు కూడా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చాలా రోజుల తర్వాత కోలుకున్నాడు. అయితే ఈ సాయంత్రం చర్చి నిర్మాణ పనులు చేస్తూ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యాడు. అతడిని మెరుగైన వైద్యం కోసం.. ఆస్పత్రికి తరలించారు.

దోపిడీ దొంగల బీభత్సం

● ఇంట్లో చొరబడి నగదు, బంగారం అపహరణ

జహీరాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): దోపిడీ దొంగలు ఇంట్లో చొరబడి బంగారం, వెండి, నగదును అపహరించుకుపోయిన సంఘటన శనివారం రాత్రి పట్టణంలోని ఆదర్శనగర్ సెకండ్‌వెంచర్‌లో జరిగింది. పట్టణ ఎస్సై వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న పెంటయ్య కుటుంబసమేతంగ ఆగస్టు30న ఇంటికి తాళంవేసి బంధువుల వద్దకు వెళ్లాడు. ఆదివారం రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటితాళం పగులగొట్టడంతో పాటు, ఇంట్లోగల బీరువా, తదితరాల తాళాలను పగులగొట్టి అందులోగల వివిధరకాల వస్తువులను చిందర వందరగ పడవేశారు. దీంతో పెంటయ్య, ఆయన కుటుంబసభ్యులు తమను ఆశ్రయించగ సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీంని రప్పించి వేలిముద్రలను సేకరించామన్నారు. రెండు తులాలబంగారం, 5తులాలవెండి, రూ.10వేల నగదును దోపిడీ దొంగలు దోచుకెళ్లారన్నారు. వీటి విలువ సుమారు 2.20లక్షల వరకు ఉంటుందన్నారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

2020లో కూడా ఇదే ఇంట్లో దొంగతనం

2020-మార్చిలో సంవత్సరంలో మున్సిపల్ ఉద్యోగి పెంటయ్య ఇంట్లో దోపిడీ దొంగలు చొరబడి ఇదేతరహాలో చోరికి పాల్పడి 9తులాల బంగారం, రూ.20వేలు ఎత్తుకెళ్లారు. దీంతో అప్పట్లో తాము పోలీసులను ఆశ్రయించగా వారు చోరీసొత్తును రికవరిచేసి తమకు కేవలం రూ.5వేలు మాత్రమే ఇచ్చారని బాధితులు వాపోయారు. ఇప్పటికెనా పూర్తిస్థాయిలో విచారణచేపట్టి చోరీ చేయబడిన సొత్తును తమకు అప్పగించేలా చూడాలని బాధితులు పోలీసులను కోరుతున్నారు.


మున్సిపల్ ఉద్యోగి ఇంట్లో చిందరవందరగా పడవేసిన వస్తువులను పరిశీలిస్తున్న ఎస్సై వినయ్‌కుమార్

పేకాటరాయుళ్ల అరెస్ట్

జహీరాబాద్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలోని మస్తాన్‌కాలనీలో సోమవారం పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నగదు, మోబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనంప్రకారం.. మస్తాన్‌కాలనీలో పేకాట ఆడుతున్న సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. దీంతో అక్కడికి వెళ్లి చూడగా నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని, వారివద్ద రూ.15,800 నగదు, 4మోబైల్‌ఫోన్లు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివిరించారు.

నెల రోజుల్లో 167 మొబైల్ ఫోన్ల రికవరీ


బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగించిన మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనానికి గురైన 167 మొబైల్ ఫోన్లు(రూ.25 లక్షల విలువ)ను గుర్తించి, నెల రోజుల్లోనే వాటిని బాధితులకు సోమవారం జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈఏడాది జనవరి నుంచి ఆగస్టు 31 వరకు జిల్లా పరిధిలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న 1264 మొబైల్ ఫోన్ల(రూ.1.89 కోట్ల విలువైన)ను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు తెలిపారు. ఫోన్లు పోగొట్టుకున్నవారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తమ ఫోన్లను ట్రాక్ చేసి తిరిగి పొందే అవకాశం ఉందన్నారు. చోరీ జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా దొంగతనమైన మొబైల్ ఫోన్‌లను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించవచ్చని, ఇది ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రగతిశీల టెక్నాలజీపై ఆధారపడిన ఒక గొప్ప సాధనమని తెలిపారు. ప్రజలు, వినియోగదారులు సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్లు కొనుగోలు చేస్తే.. ఆ దుకాణ యాజమాని నుంచి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రజల కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. సమస్యలు వస్తే పోలీసు సేవలు వినియోగించుకోవాలని సూచించారు. మొబైల్‌ఫోన్లు అందుకున్న బాధితులు ఎస్పీతోపాటు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ మధు సూదన్‌గౌడ్, ఐటీకోర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మనూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మనూరు మండలంలోని ఓ వ్యక్తి కమలాపూర్ చెరువులో పడి గల్లంతయ్యాడు. చేపలు పట్టేందుకు శనివారం మధ్యాహ్నం నారాయణఖేడ్ పట్టణానికి చెందిన ఐదుగురు యువకులు మహమ్మద్, సుదీర్, సందీప్, అద్నాన్, లతీఫ్‌లు చెరువు వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లగా, వారిలో లతీఫ్(28) అనే యువకుడు చెరువులో పడి గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు. స్థానిక పోలీసులు, రిస్క్యూటీం కలిసి వెతుకగా శనివారం రాత్రి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నారాయణఖేడ్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపారు.

ఫౌంటేన్‌ను ఢీకొని వ్యక్తి..

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బీజేఆర్ చౌరస్తా ఫౌంటేన్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామానికి చెందిన ఆకుల శశిధర్ (21) సెలెక్ట్ మొబైల్ షోరూంలో పనిచేస్తుంటాడు. ఆదివారం రాత్రి మొబైల్ షాప్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక నిమజ్జనం తర్వాత ఆకుల శశిధర్ తన గ్రామానికి స్పోర్ట్స్ బైక్ పై వెళ్తున్న క్రమంలో బీజేఆర్ చౌరస్తా ఫౌంటెన్‌ను ఢీకొని ఫౌంటెన్ లోపల పడిపోయాడు. ఫౌంటేన్ లోపలికి ఉండడంతో బయట నుంచి ఎవరికీ కనపడలేదు. సోమవారం సాయంత్రం ఆ చౌరస్తాలో పెద్ద గూడ్స్ వాహనం వెళ్తుండగా ఆ వాహనం పైన కూర్చున్న వ్యక్తి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

గుర్తుతెలియని శవం లభ్యం

సిద్దిపేట క్రైం సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు బాలాజీ గార్డెన్స్ శివారులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం అయింది. వన్ టౌన్ సీఐ వాసుదేవ రావు కథనం ప్రకారం.. ఆ వ్యక్తి వయసు 40 సంవత్సరాలు ఉంటుందని, మూడు నాలుగు రోజుల క్రితం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు అంచనా వచ్చినట్లు తెలిపారు. వ్యక్తి మృతి చెంది నాలుగు రోజులు గడుస్తున్నందున మృతదేహం కుళ్లి పోయినదని ముఖం గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నదని తెలిపారు. వ్యక్తి బ్లాక్ ఫైయింటు, వైట్ కట్ బనియన్, బయటకు గ్రే కలర్, లోపల ఆరెంజ్ కలర్ గల స్వెటర్ ధరించి ఉన్నట్లు తెలిపారు. దేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చూరి లో భద్రపరిచినట్లు తెలిపారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తు పట్టినట్లు అయితే సిద్దిపేట వన్ టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

పాత పెన్షన్ సాధించే వరకు నిర్విరామ పోరాటం

● చార్మినార్ జోన్ సాధనకు త్వరలోనే ఉద్యోగులతో బహిరంగ సభ
● జేఏసీ చైర్మన్ దొంత నరేందర్


అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ చైర్మన్ దొంత నరేందర్, ఉద్యోగులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నూతన పెన్షన్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ సాధించే వరకు నిర్విరామ పోరాటం చేస్తామని జేఏసీ చైర్మన్ దొంత నరేందర్ తెలిపారు. పెన్షన్ విద్రోహ దినంగా పరిగణిస్తూ.. సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నాకు దిగారు. ఉద్యోగుల నినాదాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం అమలైన 21 ఏళ్లల్లో సీపీఎస్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అంతేకాకుండా పదవీ విరమణ అనంతరం ఉద్యోగులకు భద్రతనిచ్చే పెన్షన్ లేకపోవడంతో చాలా మంది విశ్రాంత సీపీఎస్ ఉద్యోగులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ముందు ఏ ఒక్క ఉద్యోగి నష్టపోకుండా పాత పెన్షన్ విధానం అమలులోకి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లాను రాజన్నజోన్‌లో కలపడం వల్ల చదువుల్లో విద్యార్థులకు, నియామకాల్లో నిరుద్యోగులకు, పదోన్నతుల్లో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. చార్మినార్ జోన్ సాధనకై త్వరలో అన్ని వర్గాల ఉద్యోగులతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జేపీసీ ప్రధాన కార్యదర్శి విఠల్, టీఎస్జీవో, టీజీవో, ట్రేస, ఎస్టీయూ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజ్‌కుమార్, నాగభూషణం, మహేందర్‌గౌడ్, రాజ్‌గోపాల్‌గౌడ్, పద్మారావు, చరణ్‌సింగ్, వివిధ సంఘాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసే వరకు ఉద్యమం ఆగదు : జేఏసీ



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు ఉద్యమాన్ని ఆపేదిలేదని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. ఉద్యోగుల పెన్షన్ హక్కుని హరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ పొందడం ఉద్యోగుల హక్కు అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండదని స్పష్టం చేశారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. రాజకీయ నాయకులు కేవలం 5 సంవత్సరాలు సేవలందించినందుకే ఎమ్మెల్యే, ఎంపీలకు పెన్షన్లు ఇస్తున్న ప్రభుత్వాలు 40 సంవత్సరాలు సేవలందించిన ఉద్యోగులకు పెన్షన్లు ఇచ్చేందుకు అభ్యంతరమేమిటని వారు ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ఉద్యోగుల సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వైద్యనాథ్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు జావెద్ అలీ, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, జేఏసీ నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన రైతులు

యూరియా కోసం తప్పని తిప్పలు
టోకెన్ల కోసం పడిగాపులు
సరిపడా నిల్వలు లేక నిరాశ
ఆగ్రహంతో ఆందోళనబాట


హుస్నాబాద్ సహకార సంఘం ఎదుట రాస్తారోకో చేస్తున్న రైతులు


రాయపోల్‌లో ధర్నా చేస్తున్న రైతులు

హుస్నాబాద్/మద్దూరు/రాయపోలు/జగదేవ్‌పూర్/కుకునూరుపల్లి/కొండపాక/మనోహరాబాద్/రామాయంపేట/శివ్వంపేట/చిన్నశంకరంపేట/తూప్రాన్/చేగుంట/నర్సాపూర్/కంది, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) :యూరియా కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. సోమవారం మెదక్, సిద్దిపేట జిల్లాల్లో తెల్లవారుజాము నుంచే పడిగాపులు కాచిన రైతులకు నిల్వలు లేవని మళ్లీ రావాలని అధికారులు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఆందోళన బాట పట్టారు. రోడ్డు బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

● హుస్నాబాద్‌లో రైతులు తెల్లవారుజామునే సహకార సంఘం ముందు క్యూలో నిల్చున్నారు. గంటల తరబడి వేచి ఉన్నా యూరియా సరఫరా చేయకపోవడంతో మండిపడిన రైతులు పట్టణంలోని మన ఆగ్రోస్, సహకార సంఘం ముందు హన్మకొండ, సిద్దిపేట ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దాదాపు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బీఆర్ఎస్ నాయకులు కూడా నిరసనలో పాల్గొన్నారు. వ్యవసాయ అధికారులు, పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

● మద్దూరులో యూరియా టోకెన్ల పంపిణీలో సమాచార లోపం వల్ల రైతులు గందరగోళానికి గురయ్యారు. మండల కేంద్రంలోని సొసైటీ క్యాష్ కౌంటర్ వద్ద టోకెన్లు అందిస్తున్నట్లు తెలిసి రైతులు అక్కడికి పెద్దఎత్తున క్యూ కట్టారు. అంతలోనే రైతువేదికకు మార్చడంతో అధికారులను నిలదీశారు. 1050 బస్తాలు రాగా, కేవలం 535 మంది రైతులకు మాత్రమే యూరియా అందడంతో మిగతా వారు ఆగ్రహం వ్యక్తం చేసి ధర్నా నిర్వహించారు.

● జగదేవ్‌పూర్‌లో 450 బస్తాల యూరియా రాగా, పీఏసీఎస్ కేంద్రానికి పెద్దఎత్తున రైతులు చేరుకుని పాస్‌బుక్‌లను వరుసలో పెట్టారు. అందరికీ దొరకకపోవడంతో మిగతా రైతులు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు.

● కుకునూరుపల్లిలో యూరియా టోకెన్లు ఇవ్వడం లేదని తెలియడంతో రైతులు రాజీవ్ రహదారిపై ధర్నాకు దిగారు. అధికారులు జోక్యం చేసుకుని మంగళవారం పంపిణీ చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

● కొండపాకలో యూరియా రాక ఆలస్యం కావడంతో రైతులు రాజీవ్ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. అధికారులు టోకెన్లు ఇచ్చి యూరియా పంపిణీ చేయడంతో ఆందోళన విరమించారు.

● రాయపోల్‌లో పంటలకు సమయానికి యూరియా వేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ రైతులు ధర్నా చేపట్టారు. దీంతో గజ్వేల్ - రామాయంపేట రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

● మనోహరాబాద్‌లో ఐదు రోజుల క్రితం తీసుకున్న టోకెన్లకు కూడా యూరియా అందకపోవడంతో ఆగ్రహించిన రైతులు జాతీయ రహదారి 44ను ముట్టడించారు. సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. అధికారులు యూరియా తెప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

● రామాయంపేటలో యూరియా నిల్వలు లేకపోవడంతో మహిళా రైతులు రామాయంపేట - మెదక్ రహదారిపై బైఠాయించి గంటపాటు రాస్తారోకో చేశారు. పక్షం రోజులుగా ఈ సమస్య ఎదుర్కొంటున్నామని వాపోయారు. పోలీసులు, అధికారులు నచ్చజెప్పడంతో ధర్నా సద్దుమణిగింది.

● చిన్నశంకరంపేట మండలంలో టోకెన్ల కోసం రైతులు క్యూలో గంటలతరబడి వేచిచూశారు. మడూర్ సహకార సంఘం వద్ద ఒక రైతు అవస్థకు గురై కిందపడ్డాడు.

● తూప్రాన్‌లో వారం రోజులుగా యూరియా పంపిణీ జరగకపోవడంతో రైతులు రైతు వేదిక వద్దకు పెద్దఎత్తున వచ్చారు. ఒక లారీ లోడ్ మాత్రమే అందుబాటులో ఉండగా, మిగతావి బుధవారం వస్తాయని అధికారులు చెప్పడంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు.

● శివ్వంపేటలో సుమారు 1500 మంది రైతులు ఐదు గంటల పాటు వేచి చూసి నిరాశ చెందారు. కేవలం ఒక లారీ యూరియా మాత్రమే వచ్చిందని, మిగతావి మంగళవారం పంపిణీ చేస్తామని పీఏసీఎస్ సీఈవో చెప్పడంతో రైతులు నిరసన తెలిపి వెనుదిరిగారు.

● చేగుంటలో 600 బస్తాల యూరియా అందుబాటులోకి రావడంతో అధికారులు, పోలీసులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు పంపిణీ చేశారు.

● నర్సాపూర్ మండలంలో కూడా రైతులు యూరియా కోసం సహకార కార్యాలయాల వద్ద బారులు తీరారు. టోకెన్లు ఉన్నా యూరియా అందక ఇబ్బందులు పడ్డారు.

● సంగారెడ్డి జిల్లాలో అంతగా యూరియా కొరత లేదు. కంది పరిధిలో మాత్రం ఇబ్బందులు తలెత్తాయి. కంది పీఏసీఎస్‌కు సోమవారం లోడ్ యూరియా దిగుమతి కాగా, ఉదయం 8 గంటల నుంచే రైతులు క్యూ కట్టారు. రైతుకు 2 బస్తాల చొప్పున పంపిణీ చేశారు. గంటల తరబడి నిరీక్షించిన సరిపడా యూరియా అందక ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాల్లో రూ.50 బస్తాకు అదనంగా చెల్లించి కొనుక్కునూనే దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోయారు.





జగదేవ్‌పూర్‌లో రోడ్డుపై బైఠాయించిన రైతులు, రామాయంపేటలో ధర్నా చేస్తున్న మహిళలు, మనోహరాబాద్ ఎన్‌హెచ్44పై రైతులు, తూప్రాన్‌లో రైతువేదిక వద్ద అన్నదాతలు

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల నుంచి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. జటిలమైన సమస్యల పరిష్కారానికి గడువు నిర్దేశించి ప్రజలకు జవాబుదారీగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఫిర్యాదు చేయండి : సంగారెడ్డి ఎస్పీ పరితోష్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువయ్యేందుకే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా సంబంధిత పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలతో మాట్లాడారు. ప్రజల సమస్యలను సత్వర పరిష్కారమే ధ్యేయంగా పోలీసు శాఖ పనిచేస్తుందని అన్నారు. జిల్లా ప్రజల సమస్యలకు స్థానికంగా పరిష్కారం దొరకని పక్షంలో మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, ఎలాంటి పైరవీలకు తావు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు కార్యాలయ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.


అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

బాధితులకు న్యాయం చేయాలి : మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన దరఖాస్తులను స్వీకరించారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి 9 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి

● సిద్దిపేట కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యమివ్వాలని సిద్దిపేట కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ మేరకు ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యల పరిష్కారానికి 174 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగంపై విశ్వాసంతో ప్రజావాణి కార్యక్రమం ద్వారా తమ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు దరఖాస్తులను అందజేస్తున్నారని తెలిపారు. వాటిని ఆయా శాఖ అధికారులు ప్రత్యేకంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, డీఆర్‌వో నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో రహమాన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వినాయకుడికి 51 రకాల నైవేద్యం

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణం చాణక్యపురి కాలనీలో వినాయక నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కాలనీ వాసులంతా కలిసి సోమవారం 51 రకాల వంటకాలతో నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం భక్తులు కోలాటం ఆడి సందడి చేశారు.

ముహూర్తం ఖరారు

● 4న మెడికల్ కాలేజీ, క్రిటికల్ కేర్, క్యాన్సర్ వార్డు ప్రారంభం
● రూ.273.40 కోట్లతో 500 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన
● ఏర్పాట్లు పరిశీలించిన అదనపు కలెక్టర్, అధికారులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఈ నెల 4వ తేదీన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పలు అభివృద్ధి, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఏర్పాట్లను మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.మురళీకృష్ణలతో కలిసి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ వసంత్‌నాయక్, టీజీఎంఎస్‌ఐడీసీ అధికారులు సోమవారం పరిశీలించారు.

రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్

సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.23.75 కోట్ల వ్యయంతో 50 పడకల క్రిటికట్ కేర్ విభాగాన్ని నిర్మించారు. టీజీఎంఎస్‌ఐడీసీ ఆధ్వర్యంలో జీ+2 సామర్థ్యంలో నిర్మించిన ఈ భవనాన్ని మంత్రి తొలుత ప్రారంభిస్తారు. ఆ తర్వాత జీజీహెచ్‌లోని పాలియేటివ్ కేర్ వార్డులోని ఏర్పాటు చేసిన 10 పడకల క్యాన్సర్ డే కేర్ సెంటర్‌ను మంత్రి ప్రారంభిస్తారు.



రూ.156 కోట్లతో మెడికల్ కాలేజీ భవనాలు

ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణంలో భాగంగా రెండో విడతలో ఆర్‌అండ్‌బీ శాఖ రూ.156 కోట్ల నిధులతో మెయిన్ బ్లాక్(జీ+2), బాలుర హాస్టల్(జీ+7), బాలికల హాస్టల్(జీ+8), బాలుర రెసిడెంట్ హాస్టల్(జీ+2), ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ క్వార్టర్స్ జీ+3, నూతన మార్చురీ భవనాలు నిర్మించారు. వాటితో పాటు మెడికల్ కాలేజీకి అనుబంధంగా టీజీఎంఎస్‌ఐడీసీ ఆధ్వర్యంలో రూ.273.40 కోట్లతో నిర్మించనున్న 500 పడకల ఆస్పత్రికి మంత్రి దామోదర్ శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో వైద్య విద్యార్థులనుద్దేశించి మంత్రి ప్రసంగించనున్నారు. కొంతకాలంగా ప్రారంభోత్సవాలు వాయిదా పడుతూ రావడం, పైగా స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రారంభోత్సవ ముహూర్తం ఖరారు కావడంతో ఉత్కంఠకు తెరపడింది.



మెడికల్ కాలేజీ పరిపాలన భవనం, క్రిటికల్ కేర్ బ్లాక్

దశాబ్దాల నిరీక్షణకు తెరపడేదెన్నడో..?

● కొలిక్కిరాని ఐడీఎస్ఎంటీ ప్లాట్ల సమస్య ● హామీలు, ప్రతిపాదనలకే పరిమితం


ఐడీఎస్ఎంటీ కోసం కేటాయించిన స్థలం



జహీరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో 1982లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఐడీఎస్ఎంటీ (ఇంటిగ్రెటెడ్ డెవలఎమెంట్ స్మాల్ అండ్‌మీడియం టౌన్‌షిప్) ప్లాట్ల సమస్య నాలుగు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. 'చేస్తాం, అవుతుంది'.. అంటూ అధికారులు, నాయకులు ఇస్తున్న హామీలు, తయారుచేస్తున్న ప్రతిపాదనలు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్లాట్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు.

101 ఎకరాల్లో 1,294 ప్లాట్లు

1982లో హౌసింగ్ బోర్డుకు ఆనుకుని ఉన్న 101 ఎకరాల ప్రభుత్వ భూమిలో 1294 ప్లాట్లను ఏర్పాటు చేశారు. ఇందులో 1,115 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు సిద్ధం చేశారు. ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ అనే కేటగిరీల కింద అర్హులను గుర్తించి నామమాత్రపు ఫీజులతో 1987 నుంచి 2009 వరకు పంపిణీ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా ఈడబ్ల్యూఎస్ రూ.5వేలు (110 గజాలు), ఎల్ఐజీ రూ.15 వేలు (260 గజాలు), ఎంఐజీ రూ.16,500 (300 గజాలు), హెచ్ఐజీకు రూ.21వేలు (360 గజాలు) ఫీజులు నిర్ణయించారు.

కోర్టు వివాదంతో నిలిచిపోయిన ప్రక్రియ

నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు ప్లాట్లు కేటాయించారంటూ కొందరు 2009లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. 2013లో కోర్టు తీర్పు వెలువడుతూ, నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిన ప్లాట్లను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు సర్వేలు నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి పంపారు. కానీ, అప్పటి నుంచి ఈ వ్యవహారం అడుగు ముందుకు పడలేదు.

ఎన్నికల బ్రేక్.. కొత్త ప్రభుత్వంపై ఆశలు

గతంలో లబ్ధిదారుల సమస్యను పరిష్కరించాలని మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ అధికారులను ఆదేశించారు. అయితే, ఆ సమయంలో ఎన్నికల షెడ్యూల్ రావడంతో పంపిణీ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరిస్తుందని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం సుమారు 300 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ, వారికి మౌలిక సదుపాయాలు కరువయ్యాయి.

102 ప్లాట్లకు డబుల్ రిజిస్ట్రేషన్లు



ఐడీఎస్ఎంటీలో 102 ప్లాట్లకు సంబంధించి డబుల్ రిజిస్ట్రేషన్లు ఉన్నాయి. ఈ సమస్యపై పూర్తిస్థాయిలో సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. వారి ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణ చేపడతాం అని సష్టం చేశారు.

– సుభాష్‌రావు, మున్సిపల్ కమిషనర్

న్యూస్ బాక్స్

నేడు చేర్యాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

చేర్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా నేడు చేర్యాలలోని పోచమ్మ ఆలయ పరిసరాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టీఎస్ఎస్ పీడీసీఎల్ చేర్యాల ఏడీఈ వెంకట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లైన్, ఎల్‌టీలైన్ విద్యుత్‌లైన్ సవరిస్తున్నామని, ఈ మేరకు ఉదయం 10నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నామన్నారు.

బోధకులు, ఆయాల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం: డీఈవో

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో నూతనంగా మంజూరైన పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో బోధించడానికి మహిళా బోధకులు, ఆయాల నియమాకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బోధకులుగా పనిచేయడానికి ఇంటర్మీడియట్, తత్సమాన కోర్సు పూర్తి చేసి ఉండాలన్నారు. వీరికి రూ.8 వేలు గౌరవ వేతనం ఉంటుందన్నారు. అలాగే ఆయాలకు 7వ తరగతి ఉత్తీర్ణత కల్గిన వారు దరఖాస్తు చేసుకోవాలని, వీరికి రూ.6 వేలు గౌరవ వేతనం ఉంటుందన్నారు. 18 నుంచి 44 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, హెచ్‌డబ్ల్యూఎస్ వారికి 5 ఏళ్లు, మాజీ సైనిక ఉద్యోగులకు 3 ఏళ్లు, దివ్యాంగులకు 10 సంవత్సరాల సడలింపు ఉంటుందన్నారు. స్థానికులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 6 వరకు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

చేర్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చేర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రణీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్ విభాగంలో ఒక పోస్టు ఖాళీగా ఉందని, అర్హులైన వారు ఈ నెల 3వతేదీ సాయంత్రం 4గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత పీజీ కోర్సులో 55శాతం మార్కులతో పాసై ఉండాలని, ఎస్సీ, ఎస్టీలకు 50శాతం ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ పొందినవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెం.90144 44596 కాల్‌చేసి పొందవచ్చని తెలిపారు.

● **గజ్వేల్:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజూం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గానూ కామర్స్, కెమిస్ట్రీ, మాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్ సబ్జెక్టులలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన నిరుద్యోగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 3న తమ ధ్రువీకరణ పత్రాల జిరాక్సులతో కళాశాలలో హాజరుకావాలన్నారు.

నారాయణ స్కూల్‌లో ఉచిత కంటి పరీక్ష శిబిరం



సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలోని నారాయణ పాఠశాలలో సోమవారం ఉచితంగా కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. నేత్ర వైద్యులు డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి సిబ్బంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన సలహాలను అందించారు. విద్యార్థుల ఆరోగ్య సంక్షేమం దృష్ట్యా ఈ కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజీఎం చైతన్యా రావు, ఆర్ఐ సత్యంరావు, డీన్ పరశురాములు వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, వైష్ణవి, ఏవో నరేష్ పాల్గొన్నారు.

మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

కుకునూరుపల్లి, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి మండల స్థాయి ఎస్‌జీఎఫ్ మొదటి రోజు వాలీబాల్ పోటీల్లో విజేతగా లకుడారం జట్టు నిలిచింది. మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు సోమవారం కుకునూరుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారంభయ్యాయి. ఈ క్రీడా పోటీలను మార్కెట్ కమిటీ చెర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో సత్తయ్య ప్రారంభించారు. ఫైనల్‌లో కుకునూరుపల్లి, లకుడారం జట్లు తలపడగా లకుడారం పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు.

● **మిరుదొడ్డి:** క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదం చేస్తాయని అక్బర్‌పేట-భూంపల్లి మండల విద్యాధికారి అంజయ్య పేర్కొన్నారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. వాలీబాల్ పోటీల్లో ఖాజీపూర్ జట్టు మొదటి బహుమతి, రెండో బహుమతిని దుబ్బాక మండలం ధర్మాజీపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, మూడవబహుమతిని వెంకటరావుపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు సాధించినట్టు తెలిపారు. గ్రామవ్యాస్తవ్యులు అక్కపల్లి రాందాస్‌గౌడ్ సహకారంతో విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు మద్దుల సోమేశ్వర్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, శ్రీధర్, మధు, చిరంజీవి, బిక్షపతి, నాగరాజు తదితరులున్నారు.

పేద విద్యార్థులపై కినుక ఎందుకో?

- దౌల్తాబాద్ ఎస్సీ వసతిగృహంలో వసతులు కరువు
- హాస్టల్ గదులకు, కిటికీలకు డోర్లు లేక దోమల బెడదతో విద్యార్థులు సతమతం
- 97 మంది విద్యార్థులకు ఐదే బాత్రూంలు
- తలుపులు లేని బాత్రూంలలో టాయిలెట్ వెళ్లాలన్నా, స్నానం చేయాలన్నా ఇబ్బందులే
- విద్యార్థులు తాగేందుకు రక్షిత మంచినీరు కరువు.. బోరు నీళ్లే దిక్కు




దౌల్తాబాద్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహం, బాత్రూం తలుపుల దుస్థితి ఇలా..

దౌల్తాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు చదువుకునే వసతి గృహాల్లో సౌకర్యాలు కరువయ్యాయి. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో 97 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ, వారి సంఖ్యకు అనుగుణంగా బాత్రూంలు లేవు. ఉన్న వాటికి సరైన తలుపులు సైతం లేవు. వసతి గృహంలో దోమల బెడద సమస్యగా మారింది. విద్యార్థులు అస్వస్థతకు గురికాకముందే జిల్లా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టి మౌళిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. పేద విద్యార్థులపై కినుక వహించడం సరికాదంటున్నారు.

తలుపులు లేని బాత్రూంలు

హాస్టల్‌లో మెత్తం 5 మరుగు దొడ్లు ఉన్నాయి. విద్యార్థులు స్నానం చేయాలన్నా, టాయిలెట్‌కు వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. బాత్రూంలకు డోర్లు లేక దోమల బెడదతో బెంబేలెత్తిపోతున్నారు. వర్షం వస్తే విద్యార్థులు బాత్రూంకు వెళ్లితే తడవడమే తరువాయి. విద్యార్థుల పరిస్థితి హాస్టల్లో దయనీయంగా మారడంపై విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా కిటికీలు

హాస్టల్‌లో కిటికీలకు డోర్లు లేవు. పైగా దోమల జాలిలు కూడా లేవు. అసలే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై ఆందోళన వ్యక్తమవుతోంది. హాస్టల్ నిర్వాహకులు చేసేదేమీ లేక కిటికీలకు ఎరువుల బస్తాలను కట్టారు. కిటికీలకు జాలిలు లేక దోమలు, వివిధ విషపురుగులు ప్రవేశిస్తున్నాయి. విద్యార్థులు రాత్రి పడుకునే సమయంలో దోమల బెడదతో కంటి మీద కునుకే కరువవుతున్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాస్మోటిక్, డైట్ చార్జీలు ఏవీ?

హాస్టల్‌లో విద్యార్థులకు కాస్మోటిక్, డైట్ చార్జీలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 8 నెలల నుంచి విద్యార్థులకు కాస్మోటిక్, డైట్ చార్జీలు లేవు. సొంత డబ్బుతో సబ్బులు, సర్ఫ్ కొని తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం హాస్టల్లో విద్యార్థులకు వెంటనే కాస్మోటిక్, డైట్ చార్జీలను విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



రుణాలు అందజేస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, బ్యాంకు అధికారులు

కొండపాక, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతా కలిగి ఉండి బ్యాంకులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ జిల్లా ఆర్థిక విభాగం డిప్యూటీ డైరెక్టర్ రితీష్ పాటిల్ పేర్కొన్నారు. సోమవారం కొండపాకలో జిల్లా ఆర్థిక సేవా విభాగం యూనియన్ బ్యాంకు, లీడ్ బ్యాంకు మేనేజర్ హరిబాబు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... బ్యాంక్ అకౌంట్ కలిగిన ప్రతి ఖాతాదారులు వారి ఖాతాను నడుపుకుంటూ బీమా ప్రీమియం చెల్లించుకుంటూ ప్రయోజనాన్ని పొందడానికి రీ కేవైసీ చేయాలని సూచించారు. బ్యాంకులు అందించే అన్ని రుణ సదుపాయాలను వినియోగించుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. ఎలాంటి రుణాలు కావాలన్నా ప్రభుత్వ బ్యాంకుల నుంచే పొందాలని, ప్రైవేటు బ్యాంకుల వద్దకు వెళ్లి ఇబ్బందులు పడవద్దన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా యోజనలో బీమా చేసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ సిబ్బందికి ఉచిత బీమా సౌకర్యం ఉందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు కామేశ్వర్ రావు, చేతన్ గోర్కీ, శ్రీహరి, వీర రాఘవశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమా అగ్రవాల్ వైద్య సిబ్బందికి సూచించారు. కొండపాక పీహెచ్‌సీని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రిజిస్టర్లను ల్యాబ్, ఫార్మసీలను పరిశీలించారు ఆస్పత్రిలో ఉన్న రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు.

పేకాట స్థావరం పై పోలీసుల దాడి

చిన్నకోడూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలం మెట్టుపల్లిలోని ఆదివారం పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ సైఫ్ అలీ తెలిపిన వివరాల ప్రకారం... మెట్టుపల్లిలోని ఓ ఇంట్లో కొంతమంది పేకాడుతున్నట్టు పోలీసులకు సమాచారమందడంతో సాయంత్రం ఆ ఇంటిపై పోలీసులు రైడ్ చేశారు. ఈ సందర్భంగా ఏడుగురిని అదుపులోకి తీసుకోని వారి వద్ద నుంచి రూ.15 వేలు, 4 మొబైల్ ఫోన్‌లు, 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

గజ్వేల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సరిపడా ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీల కృషి ఫలితంగా సిద్దిపేట జిల్లాకు 2వేల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్రం కేటాయించిందని, సోమవారం గజ్వేల్ రేక్ పాయింట్‌కు వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా చేరిందని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, ఎరువులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



కొండాపూర్‌లో విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేస్తున్న సామాజిక సమరసత వేదిక సభ్యులు

మిరుదొడ్డి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం సామాజిక సమరసత వేదిక, యూత్‌ఫర్ సేవా ఆధ్వర్యంలో తల్లిదండ్రులు లేని 110 మంది విద్యార్థులకు బ్యాగులను, పెన్నులను పంపిణీ చేశారు. పేదవిద్యార్థులకు అండగా సామాజిక సమరసత వేదిక ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అందె చేతన సభ్యులు సంతోష్, కుమార్, సాయికుమార్ తదితరులున్నారు.

ఖాజీపూర్ చెరువును పరిశీలించిన 'చెరుకు'

దుబ్బాక/మిరుదొడ్డి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలోని పెద్దచెరువుకు గండిపడిన విషయం తెలిసిందే. సోమవారం ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి చెరువును పరిశీలించారు. గండి పూడ్చడానికి, చెరువుకట్ట మరమత్తు పనులను చేపట్టడానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకునివెళ్తానని తెలిపారు.

రాహుల్‌గాంధీ తక్షణమే క్షమాపణ చెప్పాలి




గజ్వేల్, చేర్యాల పట్టణాల్లో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

గజ్వేల్/ములుగు/చేర్యాల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ తల్లిపై ఇష్టారీతిన మాట్లాడిన రాహుల్‌గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పలు మండలాల్లో బీజేపీ నాయకులు ధర్నా, రాస్తారోకోలు చేపట్టారు. పలుచోట్ల రాహుల్ గాంధీ చిత్రపటాలు, దిష్టిబొమ్మలను దహనం చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను నిరసనగా ఆయన చిత్రపటాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బీజేపీ మండలాధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ములుగు మండలంలోని రాజీవ్ రహదారిపై బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ పార్టీ కార్యకర్తలతో కలిసి ధర్నా చేశారు. రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పకుంటే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. చేర్యాలలో ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు మాట్లాడుతూ మోదీ మాతృమూర్తిపై రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరంపై ప్రభుత్వ వైఖరి కుట్రపూరితం




గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని రాజీవ్ రహదారిపై, కొమురవెల్లిలో రోడ్డుపై బైఠాయించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గజ్వేల్/ చేర్యాల/కొమురవెల్లి/మద్దూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు పట్ల కుట్రపూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తుండటం తగదని మండిపడుతూ సోమవారం పలు మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని రాజీవ్ రహదారిపై బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమిషన్ రిపోర్టుపై చర్చించడం, సీబీఐకి అప్పగించడాన్ని తీవ్రంగా విమర్శించారు. తెలంగాణకు కాళేశ్వరం జీవనధార అని, కాళేశ్వరంపై కుట్రతో రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, ఎంపీపీల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవీరవీందర్, నాయకులు తదితరులున్నారు. చేర్యాలలో స్థానిక గాంధీచౌక్‌తో పాటు మండలంలోని ముస్త్యాల గ్రామచౌరస్తావద్ద జనగామ- సిద్దిపేట జాతీయప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీలు వుల్లంపల్లి కరుణాకర్, బద్దిపడిగ కృష్ణారెడ్డి, మండలపార్టీల అధ్యక్షులు అనంతుల మల్లేశం, మలిపెద్ది మల్లేశం, మంద యాదగిరి, నాయకులు పాల్గొన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మద్దూరు, దూళిమిట్ట మండలాల్లోని బీఆర్ఎస్ శ్రేణులు మద్దూరు చౌరస్తాలో ధర్నా నిర్వహించాయి. కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేసి సీఎం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు నాయకులు ఆరోపించారు.

విషజ్వరాల విజృంభణ

(5వ పేజీ తరువాయి)

విషజ్వరాల నివారణకు వెంటనే ప్రత్యేక నిధులు కేటాయించాలని గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

బాధితుల ఆవేదన

తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వి.యాదగిరి ఇంట్లో కుటుంబ సభ్యులందరికీ జ్వరాలు వచ్చాయి. వారి పెద్ద కూతురు రిత్వికకు పది రోజుల క్రితం జ్వరం రావడంతో గజ్వేల్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా డెంగ్యూ లక్షణాలు ఉన్నాయని వైద్యులు నిర్ధారించారు. ఐదు రోజుల చికిత్స అనంతరం ఆమె ఇంటికి వచ్చింది. అయితే, ఆమె చెల్లెలు మోక్షిత తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. గ్రామ వైద్య శిబిరంలో ఇచ్చిన మందులు వేసుకుంటున్నప్పటికీ జ్వరం తగ్గడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే, వాళ్ల అమ్మ నాగమణి కూడా జ్వరంతో బాధపడుతున్నది.

స్పెషల్ క్యాంప్ ఏర్పాటు చేయాలి

గ్రామంలో విష జ్వరాల నివారణకు ప్రత్యేక హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, సుమన్‌గౌడ్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో కేవలం మందులు మాత్రమే ఇస్తున్నారని, దీని వల్ల పరిస్థితి అదుపులోకి రావడం లేదన్నారు. జిల్లాలోని ప్రత్యేక వైద్య బృందాన్ని పంపి, సెలైన్ ఎక్కించడంతో పాటు, బాధితులను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మరమ్మతులు లేక వృథాగా పోతున్న చెరువు నీరు



కొండపాక, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలికట్ట గ్రామ ఊర చెరువు మరమ్మతులకు నోచుకోకపోవడంతో చెరువులోకి చేరిన నీరు వృథాగా పోతున్నది. గతంలో మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇటీవల భారీ వర్షాలకు చెరువు నిండినప్పటికీ అందులోని నీరు వృథాగా పోతున్నాయి. చెరువు మత్తడిని మార్చి చెరువు కట్ట మరమ్మతులు చేస్తే నీటి వృథాను అరికట్టడమే కాకుండా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న మత్తడిని ఎత్తు లేపుతూ వెనుక భాగాన నూతన మత్తడి నిర్మాణం చేపట్టి నీటిని కాపాడాలని కోరుతున్నారు. అదేవిధంగా 74 ఎకరాలకు పైగా విస్తీర్ణం గల చెరువు అన్యాక్రాంతమవుతుందని వెంటనే అధికారులు సర్వే చేయించి చుట్టూ హద్దులు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి అమ్ముల బాల నర్సయ్య తదితరులు డిమాండ్ చేశారు. వెంటనే చెరువు మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులని కోరారు.

పీఆర్టీయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక



పీఆర్టీయూ నూతన కార్యవర్గ సభ్యులు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సోమవారం జరిగిన ఈ సమావేశంలో పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి, రాష్ట్ర శాఖ సూచన మేరకు జిల్లా నూతన అధ్యక్ష, కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్టీయూ తెలంగాణ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా పన్యాల జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బండి సమ్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాకాల మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా బాధ్యులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గోవర్ధన్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా మధు, ఆనంద్ రెడ్డి, తిరుపతి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా యమరాజు, రమేష్, జిల్లా కార్యదర్శులుగా తిరుపతి, శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

ఆశావర్కర్ల ముందస్తు అరెస్ట్

రాయపోల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం పోలీసులు ఆశావర్కర్లను ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల మండల అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని పేర్కొన్నారు.

● **గజ్వేల్:** ఆశావర్కర్లను అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని సిద్దిపేట జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పేర్కొన్నారు. గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఆశావర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలని ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటే.. వారిని ముందస్తుగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే ఆశావర్కర్లతో చర్చలు జరిపి బెనిఫిట్, బీమా సౌకర్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలి

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సిద్దిపేట రూరల్ ఎస్ఐ రాజేష్ విద్యార్థులకు సూచించారు. సోమవారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళలకు రక్షణ, నూతన చట్టాలు, డ్రగ్స్, గంజాయి నిర్మూలించడం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ముఖ్యంగా బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలిసి ఉండాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు చారీ, మనోహర్, కానిస్టేబుళ్లు మల్లేశం, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్లలో 16 సీసీ కెమెరాలు ఏర్పాటు



గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని గజ్వేల్ ఏసీపీ నరసింహులు పేర్కొన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సోమవారం గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో గ్రామస్థుల సహకారంతో గ్రామంలో 16 సీసీ కెమెరాలను తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ శ్రీకాంత్, మాజీ సర్పంచ్ భూమయ్య, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా పోటీల్లో నారాయణరావుపేటలోని ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజిక్ డైరెక్టర్ తోట సతీష్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను సిద్దిపేట రూరల్ ఎస్ఐ రాజేష్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ సతీష్ మాట్లాడుతూ.. పాఠశాలకు చెందిన విద్యార్థులు రుష్మిక, యామిని, లిఖిత, సిరి, వైష్ణవి అద్భుత ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించినట్టు తెలిపారు.ఈ రోల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్మల్ జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి యోగాసన చాంపియన్‌షిప్‌లో వీరు పాల్గొంటారని తెలిపారు.

'వారికి పక్కా ఇల్లు ఉండడంతోనే ముగ్గు పోయలేదు'

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొందరికి పక్కా ఇల్లు ఉండడం వల్ల వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైనప్పటికీ ముగ్గు పోయలేదని ధర్మారం గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ తెలిపారు. సోమవారం మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన గజం లక్ష్మి, పరమేశ్వర్‌లకు సంబంధించిన పక్కా ఇళ్ల ఫొటోలతో పాటు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తులన్నిటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి పంపించామన్నారు. వాటిని పరిశీలించి ప్రభుత్వం అన్ని గ్రామాలకు చెందిన అర్హులకు ఇల్లు మంజూరు చేసినట్టు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైనప్పటికీ క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి ముగ్గు పోస్తున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే గజం లక్ష్మి బత్తుల పరమేష్‌లకు పెద్ద భవనాలు ఉన్న విషయాన్ని పరిశీలించామని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ముగ్గుపోయవద్దని వారు చేసిన సూచన మేరకే ముగ్గు పోయలేదన్నారు. దీనిపై వారు రాద్ధాంతం చేస్తూ తమపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. అర్హులకు న్యాయం జరగాలనే లక్ష్యంతోనే తాము పనిచేస్తున్నట్లు గ్రామ కార్యదర్శి ప్రవీణ్ పేర్కొన్నారు.

పుస్తకపఠనం అలవర్చుకోవాలి



రాయపోల్: రామసాగర్ పాఠశాలలో విద్యార్థులచే కథల పుస్తకాలను చదివిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

చేర్యాల/రాయపోల్/మిరుదొడ్డి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి పుస్తక పఠనం అలవర్చుకోవాలని రూమ్ టు రీడ్ స్వచ్ఛందసంస్థ రాష్ట్ర ప్రతినిధి కేఎన్ చారి అన్నారు. చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్‌లో సోమవారం రీడ్ ఏథాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పుస్తకపఠనం ద్వారా మేధాశక్తి పెంపొందుతుందన్నారు. అలాగే కడవేరుగు జడ్పీఎస్ఎస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం రాజమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాయపోల్ మండలంలోని అన్ని పాఠశాల్లో పుస్తక పఠనాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులు అందిరినీ ఒకచోట కూర్చుండబెట్టి కథల పుస్తకాలు ఇచ్చి చదివించారు. ఎంఈవో సత్యనారాయణరెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ భవాని మాట్లాడుతూ దీంతో విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరుగుతుందన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం పఠనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష మరియు రూమ్‌టూ రీడ్ ఇండియా ట్రస్ట్ సహకారంతో సెప్టెంబరు 1నుంచి15రోజుల పాటు సర్కారు బడుల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

సీపీఎస్‌కు వ్యతిరేకంగా ఐటీఐ కళాశాలలో నిరసన

కుకునూరుపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ వెంటనే రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని కుకునూరుపల్లి ఐటీఐ కళాశాల బోధన సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. సోమవారం కుకునూరుపల్లి ఐటీఐ కళాశాలలో బోధన సిబ్బంది మధ్యాహ్న భోజన విరమణ సమయంలో సీపీఎస్‌కు వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత విధానం ఓపీఎస్ విధానాన్ని కొనసాగించాలని వారు కోరారు. సీపీఎస్ విధానం ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రభుత్వం వెంటనే ఓల్డ్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వారు కోరారు.